క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



బిజినేపల్లి: మహిళలు చట్టాలపై అవగాహనతో ఉండాలని తిమ్మాజీపేట ఏఎస్‌ఐ శంకరయ్య అన్నారు. ఈ మేరకు తిమ్మాజీపేట మండలంలోని గోరిటలో ఆదివారం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 1098, 100, మహిళలపై జరిగే నేరాలను ఎదుర్కొనే మార్గాలను వివరించారు. అంతేగాక సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు వెంకటయ్య, బాలస్వామి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నారదగిరి వెంకయ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బిజినేపల్లి: స్వయంభుగా వెలసిన నారదగిరి లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగిరి నరసింహచార్యులు అంకురార్పణ కార్యక్రమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవ అంకురార్పణ

వట్టెం అడ్డగట్టు వేంకటేశ్వరస్వామి వారి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ అర్చక బృందం బ్రహ్మోత్సవ అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఉదయం ప్రాతరాధన, ఉత్సవాంగ స్నపనమ్, స్వామి అమ్మవార్ల అలంకార కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సాయమారాధన, కౌతుకధారణ, ఆచార్యదివరణం, సేవ ముదిలియార్ ఉత్స వం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మహేష్ యాదవ్



వంగూరు: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మండలంలోని తుమ్మలపల్లికి చెందిన గొడుగు మహేష్ యాదవ్ ఎన్నికయ్యారు. ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



కల్వకుర్తిరూరల్: పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని ఉమ్మడి మహబూబ్‌నగర్ శాసనమండలి సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎంపిక



తాడూరు: ప్రైవేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సాంబశివుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కోసం త్వరలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి జిల్లాకు వచ్చే విధంగా చూస్తామన్నారు.

మహిళా సాధికారతకు కృషి



చైర్‌పర్సన్, మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందని, ఆ దిశగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా మహాసభ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజకీయ, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పాపిశెట్టి సౌజన్య, కోశాధికారి సూరిశెట్టి సంధ్యారాణి, కవితా కుమారి, సాయిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటాం



గిరిజన మహిళలతో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని గిరిజనులు, గిరిజన సంఘాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించి వారికి అండగా నిలుస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని ఎల్లికల్‌తండాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభం ఏర్పాటు దేవాలయ అభివృద్ధితోపాటు తండావాసులకు మంచినీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. స్వచ్ఛతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధి అందరికి అందాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తండాయువకులు గ్రామ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్మద, నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ బిచ్యానాయక్, కిష్టానాయక్, చంద్రు, శివకృష్ణ, శ్రీపతిరాజు, కిషన్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ధ్వజారోహణం చేపడుతున్న అర్చకులు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో నిర్వహిస్తున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణం, ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి దేవత ఆహ్వానం, బేరి పూజ, హంసవాహన సేవ కార్యక్రమాలు చేపట్టనున్నామని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్, ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, తిరువేంగళాచార్యులు, వరుదరాజులు అయ్యంగార్, వెంకటాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

మామిళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రామస్వామిగౌడ్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న పర్వతాలు

తెలకపల్లి: బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజా పోరాటాలు నిర్వహిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల శాఖ కమిటీ సమావేశం జరిగింది. కేంద్రప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 23 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నందిపేట భాస్కర్, విజయగౌడ్, జగదీష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలో బస్సుయాత్ర బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, ఆంజనేయులు, బాలస్వామి, బాల్‌రెడ్డి, జగన్, సిద్దయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రావు విగ్రహ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్‌రావు విగ్రహాన్ని ఈనెల 12న ఆవిష్కరిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహ ఆవిష్కరణ కమిటీ చైర్మన్ కొత్తపల్లి వెంకటయ్య ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆవిష్కరణ కరపత్రాలను కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథులుగా బీఆర్‌ఎస్ పార్టీ ఢిల్లీ అధికార ప్రతినిధి మాజీ మంత్రి మందా జగన్నాథం, ఎంపీ పోతుగంటి రాములు, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, మేధావులు, అభ్యుదయ వాదులు పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఫోరం జాతీయ అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగి విజయ్, తెలకపల్లి ఎంపీపీ కొమ్ము మధు, కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, వెంకటస్వామి, వంకేశ్వరం శ్రీనివాసులు, దళిత నాయకులు బత్తుల వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు గూట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కులస్తులంతా ఏకం కావాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: తెలుగు కులస్తులు అంతా ఏకం కావాలని తెలుగు కులస్తుల సమాలోచన సభ నాయకులు డాక్టర్ పెబ్బేటి మల్లిఖార్జున్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతోపాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ కిరణ్, సింగోటం, రామన్న, డాక్టర్ శ్రీనివాస్, గొర్ల శ్రీనివాసులు, తుమ్మల అల్లోజి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగు మిత్రబృందం సందు యాదగిరి, కార్యదర్శి హరికృష్ణ, మహేశ్, నిరంజన్, సహదేవుడు, తిరుపతయ్య, అవంతి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు

మన్ననూర్: మండల పరిధిలోని నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని రాంపూర్ పెంటలో పూరి గుడిసెలు దగ్ధమై నిరాశ్రయులైన నాలుగు చెంచు కుటుంబాల వారికి అటవీశాఖ తరుపున 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, వంట సామగ్రిని ఆదివారం అందజేశారు. లింగాల ఫారెస్టు రేంజ్ అధికారి సూచన మేరకు అటవీశాఖ సెక్షన్ అధికారి శివ ప్రసాద్, బీట్ అధికారి ప్రవీణ్, వాచర్ యాదయ్యలు పెంటకు వెళ్లి అందజేశారు. ఉన్నతాధికారుల సమాలోచనతో భవిష్యత్తులో మరింత సహకారం చేసే అవకాశం ఉందన్నారు.



ప్రశ్నించేవారిని ఎమ్మెల్సీగా గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న రంగినేని అభిలాష్‌రావు

కొల్లాపూర్: శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు కోరారు. ఆదివారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడించారు. హర్షవర్ధన్‌రెడ్డికి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవం ఉందని, సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తే 317 జీఓ బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు పరమేష్, కంటె శివన్న, రఫియొద్దీన్, బాబా, బీరయ్యయాదవ్, నర్సింహయాదవ్, తగిలి కృష్ణ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తాడూరు: మండలంలోని సిర్సవాడ, ఎటిదార్‌పల్లి గ్రామాలకు చెందిన ఆయా పార్టీల యువకులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు వారందరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు గౌరీకుమార్ యువకులు పాల్గొన్నారు.

ఎంపీ రాములుకు వినతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ గ్రామపంచాయతీతోపాటు పరిధిలోని శ్రీరాంనగర్‌లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని తర్నికల్ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ ఆదివారం ఎంపీ రాములును కలిశారు. గ్రామాభివృద్ధికి ఎంపీ అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరడంతోపాటు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ పాల్గొన్నారు.

పశువుల సంతలో అన్నదానం

కల్వకుర్తి: అన్నదానం మహాదానం అని లయన్స్‌క్లబ్ ఆమనగల్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పశువుల సంతలో అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పాలు, ఉచిత షుగర్ టెస్టులు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ చరిత్రలో ఎన్నో ప్రశంసనీయమైన కార్యక్రమాలు నిర్వహించిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారి కొండల్‌రెడ్డి, జిల్లా చైర్మన్ రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బతండాకు చెందిన జర్పుల గణపతినాయక్(45) ఆదివారం గుండె పోటుతో మృతిచెందారు. వివరాలిలా.. వేరుశనగ పంటను కల్వకుర్తి మార్కెట్‌కు విక్రయించడానికి ఉదయం ఆయన ట్రాక్టర్‌లో తీసుకెళ్లారు. మార్కెట్ ఆలస్యం అవుతుందని వేరుశనగ పంటను మార్కెట్‌లో ఉంచి తిరిగి దుబ్బతండాకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

వెల్దండ: మండల పరిధిలోని అంకమోని కుంటకి చెందిన రామకృష్ణ కుటుంబానికి ఆదివారం రూ.8వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదే విధంగా బైరాపూర్‌కి చెందిన వెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గ్రామానికి చెందిన రాజుయాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, వెంకటయ్య, శేఖర్‌గౌడ్, వెంకటయ్య, రవి, శ్రీశైలం ఉన్నారు.

కల్వకుర్తి: మున్సిపాలిటీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పెద్దయ్య ఆదివారం మరణించారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం పెద్దయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైస్ చైర్మన్ శాహెద్, సత్యం, రమేష్, సుదర్శన్ ఉన్నారు.

‘బీఎస్పీ జెండా ఎగరడం ఖాయం’

తాడూరు: బీఎస్పీతోనే బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ నాయకులు నాగన్న, పృథ్వీరాజ్, కొత్ర బాలు కోరారు. ఆదివారం మండలంలోని సిర్సవాడలో సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు లక్ష్మణ్, మల్లేశ్, జగన్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే చర్యలో భాగంగా మార్చి 14న చలో హైదరాబాద్‌కార్యక్రమం నిర్వహిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాటసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పరుశరాములు చెప్పారు. ఆదివారం పట్టణంలోని యూపీఎస్ భవనంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాశన్న, హనుమంతు, జగన్, అశోక్, సత్యనారాయణ, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన కమిటీ అధ్యక్షుడిగా నాగేశ్వర్

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఈనెలలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆదివారం ఆలయం ఆవరణలో సర్పంచ్ కోనేటి తిరుపతయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బళ్లారి నాగేశ్వర్, గౌరవాధ్యక్షుడిగా మొగిలి మోహన్‌బాబు, కావేటి శ్రీనివాసులు, బళ్లారి శేఖర్, ప్రధాన కార్యదర్శులుగా కంచరి మురళి, కందూరి శ్రీనివాసులు, 11 మంది ఉపాధ్యక్షులుగా, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

బిజినేపల్లి: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు పని చేసే వారికి పార్టీ తలుపులు ఎప్పటికి తెరిచే ఉంటాయని ఆ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిదెల రాము అన్నారు. ఆదివారం మండలంలోని శాయిన్‌పల్లిలో యువతను పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీశైలం, నరేష్, పరమేష్, లక్ష్మణ్‌గౌడు, కర్ణాకర్, శ్రీకాంత్, సింగోటం పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దేశి ఇటిక్యాలలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్ ఎస్పీ కార్యాలయాలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలను ఆ భవనాలు నిర్మించేందుకు భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ, కలెక్టరేట్ కార్యాలయాల నిర్మాణం కోసం ఎస్సీ, బీసీల తమ భూములను ఇచ్చారని, వారికి నామమాత్రంగా పరిహారం చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములు కోల్పోవడంతో కనీసం జీవన ఉపాధి కరువైందని, చాలా మంది వలస వెళ్లారని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలో ఆ భవనాలను ప్రారంభించనుండడంతో భూ నిర్వాసిత కుటుంబాల్లోని అర్హత కలిగిన వారికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరుశురాములు, శ్రీనివాస్, బాలరాజు, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



సమావేశంలో మాట్లాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్ మాధవరెడ్డి

తెలకపల్లి: ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని సర్పంచ్ సుగుణబాబుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గట్టునెల్లికుదురులో బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు క్లస్టర్ ఇన్‌చార్జ్ మాధవరెడ్డి, పర్వతాలు, సత్యనారాయణ, తిరుపతయ్య, సురేష్, చంద్రారెడ్డి, చందు, కాశన్న, శ్రీను, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



సమస్యలు తెలుసుకుంటున్న వంశీకృష్ణ

వంగూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాచినోనిపల్లిలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి లాంటి హామీలు తుంగలో తొక్కారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీపీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్న పాదయాత్రతో పార్టీ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పండిత్‌రావు, నాయకులు హరీష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, చంద్రయ్య, గోకారి, రాజేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



చెట్టు మానుకు అంటుకున్న నిప్పును ఆర్పి వేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓ, సిబ్బంది

అమ్రాబాద్: ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో కాలిపోతున్న చెట్టు మానుకు ఎఫ్‌ఆర్‌ఓ, సిబ్బందితో కలిసి నీళ్లు పోసి నిప్పును ఆర్పేశారు. మద్యం దుకాణం పర్మిట్ రూం నుంచి రోజు వ్యర్థాలను తీసుకొచ్చి చెట్టు మాను వద్ద వేసి కాల్చుతుండటంతో మానుకు నిప్పంటుకుంటుందని ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు. ఎవరైనా చెట్లపై నిర్లక్ష్యం చేసి నాశనం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉమామహేశ్వర రిజర్వాయర్ ఉత్తి మాటేనా?



మాట్లాడుతున్న దేశ్యానాయక్

బల్మూర్: నియోజకవర్గంలోని బల్మూర్, అచ్చంపేట, అమ్రాబాద్ మండలాలకు సాగు నీరు అందించడం కోసం ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మిస్తామని పాలకులు చేసిన ప్రకటనలు ఉత్తి మాటేనా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్.దేశ్యానాయక్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంతం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందన్నారు. కావున చిత్తశుద్ధితో పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులకు మార్కెట్‌లో స్థిరమైన ధరలు లేక దళారుల చేతిలో దగా పడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం వేరుశనగ రైతులకు క్వింటాల్‌కు ధర రూ. 10వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శంకర్‌నాయక్, లాల్‌అహ్మద్, మహేందర్, కృష్ణయ్య, ఆంజనేయులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా జహంగీర్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా జహంగీర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు నియోజకవర్గ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్‌లు నియామక ఉత్తర్వులు అందజేశారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ పాష, రాముయాదవ్, పరశురాం నాయుడు, కాంతారావు, బాలపీరు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



తెలకపల్లి: మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఒకే వేదికలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న బాల్య మిత్రులు వారి తీపి జ్ఞాపకాలను ఒకరికి ఒకరు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల మల్లేష్, కొండలు, పాషా, ప్రభాకర్, మంజుల, అబేదబేగం, శిల్ప, కళావతి, ఊశన్న, ఆంజనేయులు, విజయలక్ష్మీ, చంద్రకళ, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.